పొగ కష్టాలకు చెక్..!

- ప్రభుత్వ బడులకు ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు
- తీరనున్న మధ్యాహ్న తంటాలు
- సంతోషంలో వంట ఏజెన్సీ మహిళలు

పాన్‌గల్: ప్రభుత్వ బడుల్లో ఇప్పటివరకు మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిమీద పొగ మధ్య తయారయ్యేది. ఇక నుంచి ఆ కష్టాలు చెక్ పెట్టనుంది. ప్రభుత్వం భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఆగస్టు 15లోగా అన్ని పాఠశాలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చుతున్నాయి. ఈ విధానంతో భోజన తయారీలో ఆలస్యం, పొగచూరడం, ఇతరత్రా సమస్యలు తలెత్తే అవకాశం ఉండదు.

పాన్‌గల్ మండల పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 36 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలవుతోంది. ఈ విద్యా సంవత్సరం 2,726 మంది విద్యార్థులు రోజు వారీగా భోజనం చేస్తున్నట్లు విద్యాశాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి. ఇందుకు 72 మంది వంట తయారీ కార్మికులు శ్రమిస్తున్నట్లు స్పష్టం చేశారు. నేటికీ శత శాతం పాఠశాలల్లో వంట చెరుకు ఆధారంగా భోజనం తయారు చేస్తున్న పరిస్థితి నెలకొన్నది. ఏళ్లుగా కట్టెలపొయ్యిపై వంట చేస్తుండడంతో పొగకు నిర్వాహకులు అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో గ్యాస్ కనెక్షన్ ఇచ్చేందుకు దస్త్రాలు కదులుతున్నాయి.



పాన్‌గల్ ఉన్నత పాఠశాలల్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న ఏజెన్సీ మహిళ

❖ కట్టెల లభ్యత లేకపోవడం, తయారీ సైతం కష్టంగా మారడంతో ప్రభుత్వ నిర్ణయాన్ని వంట ఏజెన్సీలు స్వాగతిస్తున్నాయి. ఇప్పటికే కూరగాయలు, నిత్యావసర సామగ్రి ధరలు పెరిగిన క్రమంలో భారంగానే అమలు చేస్తున్నామంటున్నారు. ఈ పరిణామాలతో ఉచితంగా గ్యాస్ పొయ్యిలు, రెండు సిలిండర్లు అందించి నిధులను సైతం ప్రభుత్వమే వెచ్చించాలనే వాదన వ్యక్తమవుతోంది.

పెండింగ్‌లో మధ్యాహ్న భోజన బిల్లులు..

మధ్యాహ్న భోజన బిల్లులు మూడునెలల నుంచి పెండింగ్‌లో ఉండటం, వంట కార్మికులకు నెలల అందించే గౌరవ వేతనం రూ.3వేల కూడా రెండునెలల నుంచి పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పాన్‌గల్ మండలంలో భోజనం, గుడ్లబిల్లులు కలిపి దాదాపుగా రూ.17.65లక్షలు,

చిన్నంబావి మండలంలో..

రూ.6లక్షలు, వీపనగండ్ల రూ.2.82లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.

మండలాల వారీగా పాఠశాలలు, వంట కార్మికుల వివరాలు ఇలా...

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	వంట కార్మికులు
పాన్‌గల్	50	2726	72
చిన్నంబావి	30	1593	47
వీపనగండ్ల	26	1350	40

బిల్లులు మంజూరు కాక ఇబ్బందులు



మధ్యాహ్న భోజన బిల్లులు రెగ్యులర్‌గా అందక ఇబ్బందులు పడుతున్నాం. ఇచ్చే నెల వేతనం కూడా నెలనెల అందడం లేదు. మూడునెలల నుంచి బిల్లులు అందకపోవడంతో అప్పులు చేసి సరుకులు తెస్తున్నాం. బిల్లులు చెల్లింపులు ఇలాగే ఉంటే వంట చేయలేం.

– గోవిందమ్మ, వంట కార్మికురాలు, ఉన్నత పాఠశాల, పాన్‌గల్

సిలిండర్లు ఇవ్వడం శుభపరిణామం



ప్రస్తుతం మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిపై చేయడం కష్టంగా మారింది. ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లు అందిస్తుందని విన్నాం ఇది శుభపరిణామం. దీంతో కట్టెల పోయితో అనారోగ్యాలకు గురయ్యాం. ప్రభుత్వం నిర్ణయం మంచిదేనన్నారు.

– పద్మమ్మ, వంట కార్మికురాలు, ఉన్నత పాఠశాల, అయ్యవారిపల్లి, చిన్నంబావి

బిల్లుల పెండింగ్ వాస్తవమే



మధ్యాహ్న భోజనం బిల్లులు, వంట కార్మికుల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. వివరాల నివేదికలను ప్రభుత్వానికి నివేదించాం. గ్యాస్ కనెక్షన్లను పాఠశాలలకు అందిస్తోందని ఉత్తర్వులు అందాయి. గ్యాస్ పొయ్యి, స్టౌ మాత్రమే సర్కార్ ఇస్తుంది.

– శ్రీనివాసులు, ఎంఈఓ, పాన్‌గల్

క్లుప్తంగా

సినారెకి ఘన నివాళి



వనపర్తిటౌన్: తెలుగు సాహిత్య ప్రపంచానికి చెరగని చిరునామా కవి సినారె అని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో కవి సింగిరెడ్డి నారాయణరెడ్డి 95వ జయంతిని నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నరసింహశర్మ, బోయ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు బాలస్వామి నాయుడు, కళాకారులు బాలేమియా, కురుమయ్య, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిరంజనయ్య, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగస్వామి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పరమేశ్వర చారి, సత్యం చారి, విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులుశెట్టి, జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వీరప్ప, డీటీఎఫ్ నాయకుడు నరసింహ, ఎంఈఎఫ్ నాయకుడు రాంబాబు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ బురదమయం



వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో అంతర్గత రోడ్లన్నీ చిన్నపాటి వర్షాలకు బురదమయంగా తయారవుతున్నాయని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం వార్డులో అఖిలపక్ష ఐక్యవేదిక ప్రతినిధులు పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సతీష్‌యాదవ్ మాట్లాడుతూ వార్డు విభజనలో అన్యాయం జరిగిందన్నారు. అధికారులు సరైన విధంగా నిధులను ఉపయోగించకుండా ఇష్టానుసారంగా రోడ్లు వేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జంగిడిపురం మర్రిచెట్టు నుంచి అనూస్ స్కూల్ వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు వార్డు దుస్థితి గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శంకర్, యాదయ్య ఉన్నారు.

ఉద్యాన రాయితీలను వినియోగించుకోవాలి

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అందుతున్న సబ్సిడీని వినియోగించుకొని కూరగాయల సాగును చేపట్టాలని మండల ఉద్యానశాఖ అధికారి కృష్ణయ్య మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 50 శాతం సబ్సిడీతో శాశ్వితపందిర్లు వేసుకొని తీగజాతి కూరగాయలైన బీర, కాకర, సొర తదితర కూరగాయలను పండించుకోవాలన్నారు. దీనికి ఎకరాకు ప్రభుత్వం నుంచి రూ.లక్ష వరకు సబ్సిడీ అందుతుందన్నారు.

పాత బస్టాండ్‌లోనే బస్సులు నిలపాలి

వీపనగండ్ల: మండల కేంద్రం పాతబస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు నిలపాలని గ్రామ యువకులు మంగళవారం తహసీల్దార్ వరలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న పాతబస్టాండ్ ప్రత్యామ్నయంగా గ్రామంలోని కొందరు వేరొకచోట బస్‌షెల్టర్‌ను నిర్మించారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరత తలెత్తకుండా చూడండి



గోపాల్‌పేట: పీఎం ఆవాస్‌యోజన ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా చూడాలని బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఇళ్ల లబ్ధిదారులు, బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల నిర్మాణానికి 15 ట్రిప్పుల ఇసుక ఉచితంగా ఇవ్వాలన్నారు. వారి వెంట మండల ఇంచార్జ్ మధు, నాయకులు అరవింద్ రెడ్డి, అశోక్‌రెడ్డి, మహేష్, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

వనపర్తి రూరల్: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విండో సింగిల్ విండో చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని నాగవరం సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో రఘువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు, కార్యాలయ సిబ్బందితో కలసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాలచంద్రయ్య, డైరెక్టర్స్ సుదర్శన్‌రెడ్డి, సంజీవ్‌సాగర్, శివశంకర్‌రెడ్డి, జయరాములునాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నూనెగింజల సాగుపై దృష్టి సారించాలి



పాన్‌గల్: రైతులు ఒకే పంటలను సాగు చేయకుండా ప్రత్యామ్నాయంపై దృష్టి సారించి అధికలాభాలను పొందాలని ఏడీఏ తిప్పేస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని మల్లాయిపల్లి గ్రామ రైతువేదికలో రైతునేస్తంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న (ఎన్ఎంఈఓ–ఓఎస్‌స్కీమ్) ద్వారా నూనెగింజల పంటల సాగును పెంచేలా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకొని రైతులు నూనెగింజల ఉత్పత్తి పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీటితోనే రోగాలు



పాన్‌గల్: పరిసరాలు, ఇంట్లో ఎక్కువ కాలం ఉండే నిల్వ నీటితో రోగాలు సంభవిస్తాయని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. డ్రైడేలో భాగంగా మంగళవారం మల్లాయిపల్లి గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కువ కాలం నీరు నిల్వతో అందులో దోమలు వృద్ధి చెందడంతో రోగాలు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, ఎస్తేరమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దరిచేరవు



వనపర్తిటౌన్: పరిశుభ్రతతో ఉంటేనే రోగాలు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మంగళవారం 100 రోజుల కార్యాచరణలో జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో పొడి, తడి వ్యర్థాలపై పరిశీలించారు. అదేవిధంగా హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ దుకాణాలపై ప్లాస్టిక్ రైడ్ నిర్వహించి మొత్తం రూ.5వేల జరిమానా వేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు, జూనియర్ అసిస్టెంట్ సాయికృష్ణ, సూపర్‌వైజర్, వార్డు అధికారి నితీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయదారుల బైండోవర్

వీపనగండ్ల: మండలంలోని నాగర్లబండ తండాకు చెందిన ఇరువురు మహిళలను సారా విక్రయిస్తున్న నెపంతో మంగళవారం తహసీల్దార్ ఎదుట ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ చేశారు. వారిలో రాత్లావత్ రోపి, ముడావత్ సోనీ తండాలో సారాను విక్రయిస్తున్నారు. దీంతో మరోమారు సారా తయారు చేయకుండా తహసీల్దార్ బైండోవర్ చేసినట్లు అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



కొత్తకోటలో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

వనపర్తి రూరల్: నాగులచవితిని మంగళవారం వనపర్తి, శ్రీ రంగాపురం పెబ్బేరు మండలంలో పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో నాగులచవితిని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో నాగదేవత విగ్రహాలకు, నాగులపుట్ట దగ్గర మహిళలు పూజలు చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: మండలంలో నాగులుపంచమిని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పుట్టలో పాలుపోసి, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తకోట రూరల్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నాగపంచమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పుట్టలో పాలు పోశారు.

కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..

కానాయపల్లి గ్రామ స్టేజీ సమీపంలో కోటిలింగేశ్వర దత్తదేవస్థానంలో నాగులచవితి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శివలింగాన్ని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

అమర చింత: మండలకేంద్రంతో పాటు గ్రామా ల్లో నాగులపంచమిని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాల్లో నాగుల విగ్రహాలకు పాలతో అభిషేకిస్తూ పూజలు నిర్వహించారు.



పెబ్బేరులో..



వనపర్తిలో నాగులకు పాలుపోస్తున్న చిన్నారి



కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..

డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం

ఆత్మకూర్: డ్రగ్స్ మహమ్మారిని తరిమేసేందుకు యువత ముందుకు రావాలని, సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్ సైదులు, తిప్డంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫయాజ్‌అహ్మద్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాలతో కీటకజనిత వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికూన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి విషజ్వరాలు వస్తాయన్నారు. దోమలు రానియకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు దోమతెరలను వాడాలని, ఇంటి ఆవరణలో పాతటైర్లు, ఇతర వస్తువులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరిత, అధ్యాపకులు భాగ్యవర్ధన్‌రెడ్డి, టీజే విశ్వేశ్వర్, కురుమూర్తి, ఆరోగ్యపర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, వైద్యులు

భవన నిర్మాణ కార్మికులకు పథకాలు పెంచాలి

అమరచింత: భవన నిర్మాణ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 282జీవోను రద్దుచేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని మార్క్స్ భవనంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న కలెక్టర్ ఆఫీస్ దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాజు, కురుమన్న, మస్లమణి, మన్నెం, జిలాని, రాజు, మైబు, అశోక్ పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట: ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం పట్టణంలో మనగ్రోమోర్, సంకల్ప్ ఎరువుల దుకాణాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాల ధరల పట్టికను సూచ తప్పకుండా పాటించాలని తెలిపారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో నమోదవుతున్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులకు అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు ఇవ్వాలన్నారు. డీఏపీ యూరియా, జిప్సం ఎరువుల నిల్వలను పరిశీలించారు. ధరల సూచిక బోర్డు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏడీఏ దామోదర్‌ను ఆదేశించారు. వారివెంట డీఎంహెచ్ఓ డా.శ్రీనివాసులు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏడీఏ దామోదర్, ఏఓ జాస్మిన్ ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మదనాపురం: పీహెచ్‌సీల్లో వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ పేదలకు వైద్యం అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపన్‌పేట సందర్శనకు వెళ్లారని కలెక్టర్‌కు సిబ్బంది వివరించారు. మందుల నిల్వలు రికార్డులను పరిశీలించారు. పాము, కుక్కకాటు వ్యాక్సిన్ మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ డా.శ్రీనివాసులు, తహసీల్దార్ జేకే మోహన్ తదితరులు ఉన్నారు.

విస్తరణ పేరుతో వేధింపులు సరికాదు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రం పాలిటెక్నిక్ కళాశాల రోడ్ల విస్తరణకు సహకరిస్తామని చెప్పిన తర్వాత అధికార హోదా లేని సిబ్బంది నివాసాల ఎదుట ఉన్న ర్యాంపులు, మెట్లు తొలగిస్తామని హల్‌చల్ చేయడం ఏంటనీ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ కౌన్సిలర్ తిరుమల్, బాధితులు కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. రోడ్ల విస్తరణ బాధితులు మంగళవారం కమిషనర్‌తో మాట్లాడారు. విస్తరణకు సహకరించే బాధితులకు ముందస్తు సమాచారం లేకుండా పనులు ఎలా ప్రారంభించారన్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించకుండా సక్రమ నిర్మాణాలపై వేధింపులకు దిగడం సరికాదని కోరారు. ఈ మేరకు స్పందించిన కమిషనర్ విస్తరణ అంశం పట్టణ ప్రగతికి సంబంధించిందన్నారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో నగేష్, గిరీష్, సురేష్, సాయి కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న కాలనీ వాసులు, తిరుమల్

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు



ఆత్మకూర్: అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నామని విడతల కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం పురపాలికలో ఖానాపూర్‌లో లబ్ధిదారుల ఇళ్ల భూమిపూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్,వెంకటన్న, లక్ష్మన్న, రాజన్న ఉన్నారు.

నేడు ఆత్మకూర్‌కు మంత్రులు రాక

ఆత్మకూర్: ఆత్మకూర్ వ్యవసాయమార్కెట్ కమిటీ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి నేడు రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, సీతక్కలతోపాటు క్రికెటర్ అజరుద్దీన్, రాష్ట్ర బాలలమక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ సీతమ్మ, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ నాగరాజుగౌడ్‌తోపాటు పలువు హాజరవుతున్నట్లు మంగళవారం ఎండీ రహ్మతుల్లాను తెలిపారు. రేచింతల, వీరరాఘవపూర్, తిప్డంపల్లిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అలాగే జగ్జీవన్‌రాం విగ్రహ ఆవిష్కరణ, మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం పాల్గొంటారన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

గోపాల్‌పేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు చాకల్‌పల్లిలో ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సౌకర్యాలపై ఆరా తీశారు. కేటీఆర్ ఆదేశాల మేరకు విజిట్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మతీన్, బీఆర్ఎస్వీ నాయకుడు లాలునాయక్, మన్సూర్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

కొత్తకోట రూరల్: పెద్దమందడి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(అనూస్ కళాశాల బిల్డింగ్, కొత్తకోట రోడ్, నాగవరం తండా, వనపర్తి)లో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఎస్సీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వార్షిక పరీక్షల మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇస్తామని.. విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు కళాశాలకు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో వచ్చి అడ్మిషన్లు పొందాలని పేర్కొన్నారు.

వీపనగండ్ల కళాశాలలో..

వీపనగండ్ల: వీపనగండ్ల పేరున కొత్తకోటలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని.. మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి నర్సింహులు కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు కొత్తకోట కళాశాలలో ప్రిన్సిపాల్ సాయి రెడ్డి ఆధ్వర్యంలో అడ్మిషన్లు జరుగుతాయని.. ఎంపీసీ, బైపీసీ గ్రూపులో చేరాలనుకునే విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు రెండుసెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని తెలిపారు.

మదనాపురంలో..

మదనాపురం: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని.. ఆసక్తిగల విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు మూడుసెట్ల జిరాక్స్‌లు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం తగ్గొద్దు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మంగళవారం మానాజీపేట ప్రాథమిక పాఠశాలలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులను నిత్యం పాఠశాలకు రప్పించగలిగితే చెప్పే పాఠాలు అర్థమవుతాయన్నారు. అందుకు తగిన వాతావరణాన్ని కల్పించే బాధ్యత హెచ్ఎం, ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: సీఈఐఆర్ పోర్టల్‌ద్వారా బాధితులకు చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరిచేసి మంగళవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన తెలుగుకృష్ణకు చెందిన సెల్‌ఫోన్ ఫిబ్రవరి 16న చోరీకి గురయ్యిందన్నారు. చిన్నచింతకుంటలో ఫోన్‌ట్రేస్‌చేసి స్వాధీనం చేసుకుని బాధితులకి అప్పగించినట్లు తెలిపారు.

తెగుళ్ల బారినుంచి పంటలను కాపాడుకోవాలి



అమరచింత: వరి, మొక్కజొన్న పంటలకు తెగుళ్లసోకే అవకాశం ఉందని వీటిని ముందస్తుగా గుర్తించి సరైన సమయంలో మందులను పిచికారీ చేసి రైతులు కాపాడుకునే అవకాశం ఉందని ఏఓ అరవింద్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్ గ్రామంలో మంగళవారం వరి, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ..ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మొక్కజొన్న పంటకు కత్తెర, సుడిపురుగులు ఆశించే అవకాశం ఉందన్నారు. కత్తెర, సుడిపురుగు ఆశించినప్పుడు అవి ఆకులను తంటూ గుండ్రటి రంధ్రాలు ఏర్పరస్తాయన్నారు. అలాగే మొవ్వల్ని రంధ్రాన్ని చేసుకొని లోపల కాండాన్ని తింటాయన్నారు. వీటి నివారణకు కారబోఫ్యూరాన్ 3 శాతం జి లేదా ఫిప్రోనిల్ 0.3శాతం జి గుళికలు మొక్క సుడిలో వేసుకోవాలని సూచించారు. పిచికారీ కోసం ఏమామెక్టిన్ బెంజుట్ 5శాతం డబ్ల్యూజీ 0.6 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నంద కిషోర్ రైతులు కుర్వ రమేష్, రామకృష్ణ, నాగిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

“ఆటలకేనా చదువుకు ఉండదా బడ్జెట్ ”



వనపర్తిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆటలకు బడ్జెట్ పెడుతుంది కానీ చదువుకు ఎందుకు పెట్టడం లేదని, బడ్జెట్ ఆటలకేనా చదువుకు ఉండదా అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. విద్యారంగాన్ని ముఖ్యమంత్రి గాలికి వదిలేశారని, రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలన్నారు. వందలకోట్లు పెట్టి అందాల పోటీలను పెట్టిన సీఎం విద్యారంగ అభివృద్ధికి బడ్జెట్ లేవనడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేస్తాం

ఆత్మకూర్: అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతున్నాయని విడతల వారీ గా అందరికి న్యాయం చేకూరుతుందని కాంగ్రెస్‌పార్టీ నాయకుల అన్నారు. మంగళవారం ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో లబ్ధిదారుల ఇళ్ల భూమిపూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, వంశీ, వెంకటన్న పాల్గొన్నారు.